క్లుప్తంగా

బాటిళ్లలో పెట్రోల్ పోయరాదు

కొల్లిపర: ఆయిల్ బంకుల్లో సోమవారం నుంచి బాటిళ్లలో పెట్రోలు పోయరాదని ఎస్ఐ ఆర్.రవీంద్రరెడ్డి బంకు యజమానులకు సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసిన అనంతరం చోటుచేసుకుంటున్న ఘటనల నేపథ్యంలో నిబంధన విధించినట్లు పేర్కొన్నారు.

అన్నమయ్య పాటల పోటీలకు విశేష స్పందన



తెనాలిఅర్బన్: అన్నమాచార్యుల జయంతి సందర్భంగా సంకీర్తన పోటీలు ఆదివారం నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన సేవా బృందం ఆధ్వర్యంలో బోసురోడ్డులోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థాన ఆవరణలోని గీతా మందిరంలో పోటీలు నిర్వహించారు. సీనియర్, జూనియర్ విభాగంలో పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా ఆల్ ఇండియా రేడియో అనౌన్సర్, న్యూస్ అసిస్టెంట్ ఎడిటర్ కేఎస్ పూర్ణచంద్రిక వ్యవహరించారు. నిర్వాహకులు కొండపి వసుంధర, శ్రీనివాసరావు మాట్లాడుతూ చిన్నారుల్లో భక్తి భావం పెంపొందించడానికి దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో లక్కరాజు కనకదుర్గ, అందె బాలచంద్రమౌళి, పి.వంశీకృష్ణ, కె.రమాదేవి, వి.లక్ష్మీరజిని, బి.శాంతి, ఎ.రాజేశ్వరి పాల్గొన్నారు.

ప్రపంచ విప్లవ నాయకుడు హోచిమన్

తెనాలి: ప్రపంచ విప్లవ నాయకుడు, వియత్నాంఅధ్యక్షుడిగా పనిచేసిన హోచిమన్ జయంతిని ఇక్కడి గాంధీనగర్‌లోని ఇస్కఫ్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. కొల్లిపర కార్యక్రమానికి తుంగా బాలస్వామి అధ్యక్షత వహించారు. సంస్థ జాతీయ సభ్యుడు, రాష్ట్ర కార్యదర్శి బొల్లిముంత కృష్ణ మాట్లాడుతూ హోచిమన్ జీవిత విశేషాలను వివరించారు. కార్యక్రమంలో సంస్థ సాంస్కృతిక విభాగం కార్యదర్శి బెల్లంకొండ వెంకట్, ఇస్కఫ్ సభ్యులు ఆలూరి సత్యేంద్రనాథ్, కాకుమాను గోపాలకృష్ణ, నాగరాజు, శ్రీదేవి, బెజ్జంకి నాగమణి, విజయసారథి పాల్గొన్నారు.

పోలీసుల కవాతు



తెనాలిరూరల్: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని వన్‌టౌన్ సీఐ జి.దశరథరామారావు పేర్కొన్నారు. మరికొద్ది రోజుల్లో సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో పట్టణంలో వన్‌టౌన్ పోలీస్ సిబ్బంది ఆదివారం కవాతు నిర్వహించారు. సీఐ నేతృత్వంలో పోలీస్ అధికారులు, సిబ్బంది కలిసి చినరావూరుతోట ప్రాంతంలో కవాతు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంలో అలజడులు రేగకుండ చర్యలు తీసుకున్నామని, కౌంటింగ్ సందర్భంగా ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. అలానే రూరల్ సీఐ టి. వెంకటేశ్వర్లు, ఎస్ఐ పి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో అంగలకుదురులో ఆదివారం రాత్రి రూట్ మార్చ్ నిర్వహించారు.

పెట్రోల్ బంకులకు నోటీసులు

తెనాలిరూరల్: ఎన్నికల నిబంధనలు అమలులో ఉన్న నేపథ్యంలో వాటిని ఉల్లంఘించరాదని రూరల్ ఎస్ఐ పి.కోటేశ్వరరావు చెప్పారు. ఎన్నికల సందర్భంగా అక్కడక్కడ జిల్లాలో స్వల్ప ఘటనలు జరిగిన నేపథ్యంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఈనెల 4న కౌంటింగ్ ప్రక్రియ ముగిసేంత వరకు ప్రశాంత వాతావరణానికి భంగం కలగకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. దీనిలో భాగంగానే పెట్రోల్ బంకుల యాజమాన్యాలు కూడా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ విడిగా బాటిల్స్, క్యాన్లలో పెట్రోల్, డీజిల్ పోయకూడదన్నారు. ఈ మేరకు బంకుల నిర్వాహకులకు ఆదివారం నోటీసులు అందించినట్లు చెప్పారు. విధిగా ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని, ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవన్నారు.

బాణసంచా షాపులకు నోటీసులు..

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలో వున్న బాణసంచా షాపులకు ఆదివారం తాడేపల్లి సీఐ కల్యాణ్ రాజ్ నోటీసులు అందజేశారు. జూన్ 4వ తేదీ ఎన్నికల ఫలితాల దృష్ట్యా, ఆ సందర్భంగా బాణసంచా పెద్ద మొత్తంలో అమ్మకూడదని ఎన్నికల కమిషన్ ఆదేశించిందని, దానిలో భాగంగా ఉండవల్లిలో ఉన్న హోల్‌సేల్ బాణసంచా దుకాణాలకు ఈ నోటీసులు అందజేశామన్నారు. జూన్ 4వ తేదీ పోలీసుల అనుమతి లేకుండా ఎవరూ ర్యాలీలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించకూడదని, పెట్రోల్ బంకుల వారు పెట్రోల్, డీజిల్‌ను క్యానుల్లో, బాటిళ్లలో అమ్మకూడదని ఆయన సూచించారు.

రంగస్థల నటుడు

సాంబయ్యకు జీవిత సాఫల్య పురస్కారం

- కథానాటిక/స్వీయ రచనల పోటీల విజేతలకు బహుమతులు
- ముగిసిన రాష్ట్ర స్థాయి ఆహ్వాన నాటికల పోటీలు



నూతలపాటి సాంబయ్యకు జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం చేస్తున్న అతిథులు

తెనాలి: రూరల్ మండలం కొలకలూరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఆహ్వాన నాటికల పోటీల ముగింపు సభలో సత్తెనపల్లికి చెందిన ప్రముఖ రంగస్థల నటుడు, దర్శకుడు, గుణనిర్ణేత నూతలపాటి సాంబయ్యకు దివంగత గోపరాజు వెంకట శివరామ సుబ్రహ్మణ్యశర్మ జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం చేశారు. కొలంకపురి నాటక కళాపరిషత్, కొలకలూరు, వైకే నాటక కళాపరిషత్, హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. బహుమతి ప్రదానం అనంతరం జీవన సాఫల్య పురస్కారాన్ని ప్రదానోత్సవం నిర్వహించారు. తొలుత చలసాని కృష్ణప్రసాద్, తాళ్లూరు సత్యనారాయణ జ్యోతి ప్రజ్వలన చేశారు. సభకు పిన్నమనేని మృత్యుంజయరావు అధ్యక్షత వహించారు.

కథానాటికల పోటీల విజేతలకు...

తెలుగు కళాసమితి, విశాఖపట్నం నిర్వహించిన కథానాటిక/ స్వీయరచనల పోటీల్లో విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. ప్రథమ బహుమతి 'ఆకాశంలో ఒక నక్షత్రం'(రచయిత: వంశీ మట్టా), ద్వితీయ బహుమతి 'చిటికెన వేలు' (అట్టాడ అప్పలనాయుడు), తృతీయ బహుమతి 'యత్ర నార్యస్తు పూజ్యంతే' (పాణ్యం దత్త శర్మ)కు అందజేశారు. 'చేతులు కాలాక' (పెండ్యాల గాయత్రి), 'తరంగిణి' (తులసి బాలకృష్ణ), 'బంధాల బందిఖానా'(పీటీ మాధవ్), 'స్వేదఫలం'(వల్లూరు శివప్రసాద్), 'సయ్యాట'(స్నిగ్ధ)కు జ్యూరీ బహుమతులను అందజేశారు. ఈ రచనల పోటీలకు చలసాని కృష్ణప్రసాద్, వైఎస్‌కేఎస్ స్వామి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

సాంఘిక నాటక/ నాటికల పోటీల విజేతలకు...

ఇదే వేదికపై కొలంకపురి నాటక కళాపరిషత్, శ్రీసాయి ఆర్ట్స్, కొలకలూరు సంయుక్త నిర్వహణలో జరిపిన రాష్ట్ర స్థాయి సాంఘిక నాటక, సాంఘిక నాటికల పోటీల విజేతలకు నగదు బహుమతులను అందజేసి సత్కరించారు. సాంఘిక నాటకం విభాగంలో ప్రథమ బహుమతి '27వ మైలురాయి' (పీటీ మాధవ్)కు లభించింది. ద్వితీయ బహుమతి 'నెత్తురు' (కేవీవీ సత్యనారాయణ), సాంఘిక నాటికల విభాగంలో.. ప్రథమ బహుమతిని 'వాన'ప్రస్థానం' (సీహెచ్ సింహప్రసాద్) గెలుచుకోగా, 'మా యింట్లో మహాభారతం' (మద్దుకూరి రవీంద్రబాబు)కు ద్వితీయ బహుమతి లభించింది. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా కేవీ బలరామమూర్తి, భట్టిప్రోడి శ్రీనివాస సుబ్బారావు వ్యవహరించారు.

ప్రత్యేక నాటిక ప్రదర్శన...

సభానంతరం శ్రీసాయి ఆర్ట్స్, కొలకలూరు వారి 'కౌసల్యా సుప్రజారామా' నాటికను ప్రత్యేకంగా ప్రదర్శించారు. ఆకెళ్ల శివప్రసాద్ మూలకథను స్నిగ్ధ నాటకీకరించగా, గోపరాజు విజయ్ దర్శకత్వం వహించారు. సభలో ప్రముఖ సినీమాటల రచయిత సాయిమాధవ్ బుర్రా, రంగస్థల ప్రముఖులు ఆకురాతి భాస్కర్‌చంద్ర, కేవీ బలరామమూర్తి, నాటక పరిశోధకుడు డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు, పురుషోత్తమరావు, భారతుల ఫణి, పరిషత్ బాధ్యులు లోకం సూర్యనారాయణ, సుంకర శ్రీనివాసరావు మాట్లాడారు.

ప్రశాంత పరిస్థితులకు సహకరించండి

- తుళ్లూరు డీఎస్పీ అశోక్ గౌడ్
- నిడుముక్కలలో ఇరువర్గాలతో శాంతి కమిటీ సమావేశం

నిడుముక్కల(తాడికొండ): ప్రజలు తాత్కాలిక ఆవేశాలకు లోను కాకుండా శాంతియుతంగా వ్యవహరిస్తే గ్రామంలో ప్రశాంత పరిస్థితులు ఏర్పడతాయని, దీనికి అందరూ సహకరించాలని తుళ్లూరు డీఎస్పీ ఇ.అశోక్ గౌడ్ సూచించారు. తాడికొండ మండలం నిడుముక్కల గ్రామంలో ఎన్నికల సందర్భంగా జరిగిన వివాదాల నేపథ్యంలో పోలీసు పికెటింగ్ కొనసాగుతుంది. ఆదివారం డీఎస్పీ అధ్యక్షతన గ్రామంలోని ఇరు వర్గాలతో పోలీసు పికెటింగ్ నిర్వహించి శాంతి కమిటీ ఏర్పాటుకు ప్రతిపాదించారు. అయితే ఇరు వర్గాలు కమిటీ నిర్వహణకు తమకు కొంత సమయం కావాలని కోరడంతో త్వరలో మళ్లీ సమావేశం ఏర్పాటు చేస్తామని, అప్పట్లోగా అందరూ సంసిద్ధంగా ఉండాలని డీఎస్పీ సూచించారు. ప్రజలకు తగిన సేవలందించేందుకే పోలీసు శాఖ ఉందని, సమస్యలు, ఇబ్బందులు ఏమైనా ఎదురైతే తమ దృష్టికి తీసుకొస్తే సత్వరం పరిష్కరిస్తామన్నారు. సొంత నిర్ణయాలతో ముందుకెళ్లి వివాదాస్పద పరిస్థితులకు అవకాశం కలిపించకుండా, గ్రామంలో ప్రశాంత పరిస్థితులు ఏర్పడేందుకు సహకరించాలన్నారు. అనంతరం పోలీసు బలగాలతో గ్రామంలో కవాతు నిర్వహించి సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. సీఐ సీహెచ్ ప్రభాకర్, ఎస్ఐలు రవీందర్, అంజయ్య పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా నీలం సంజీవరెడ్డి జయంతి వేడుకలు



తాడేపల్లిరూరల్: భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ నీలం సంజీవరెడ్డి 111వ జయంతి వేడుకలను ఎంటీఎంసీ పరిధిలోని రామచంద్రాపురంలో నీలం సంజీవరెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత నీలం సంజీవరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయానికి నీలం సంజీవరెడ్డి సచివాలయం అని నామకరణం చేయాలని కోరుతున్నామన్నారు.

కార్మెల్‌మాతను దర్శించుకున్న భక్తులు



ఫిరంగిపురం: మండలకేంద్రంలోని కార్మెల్‌మాతను దర్శించుకునేందుకు పలుప్రాంతాలనుంచి ఆదివారం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పొద్దుటూరు, దర్శి, ధర్మవరం, కర్నూలు, మార్కాపురం ప్రాంతాలను పలు వాహనాలు, రైళ్లలో తరలి వచ్చారు. కొండ ఎక్కి తలనీలాలు సమర్పించారు. కార్మెల్‌మాత మందిరంలో కొవ్వొత్తులు వెలిగించి, కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

ముగిసిన సుదర్శన, నారసింహ మహాయాగం

నగరంపాలెం: క్రేన్ రిలీజియస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అంకిరెడ్డిపాలెంలో వరసిద్ధి విఘ్నేశ్వర స్వామి దేవస్థానం (పంచాయతన క్షేత్రం)లో ఈనెల 10 నుంచి 19 వరకు నిర్వహిస్తోన్న నవాహ్నిక నవకుండాత్మక శ్రీసుదర్శన, నారసింహ మహాయాగం ఆదివారంతో ముగిశాయి. ఈ క్రమంలో సాముహిక షష్టిపూర్తి మహోత్సవాలు, మహా పూర్ణాహుతి, చక్రస్నానం, వేద ఆశీర్వచనం, ఉత్సవ పరిసమాప్తి చేపట్టారు. అనంతరం 200 మంది జంటలకు క్రేన్ సంస్థల అధినేత గ్రంధి వెంకటసత్యలక్ష్మీ కాంతారావు, లక్ష్మీహైమావతి ఆధ్వర్యంలో తాళి, మెట్టెలు, తాంబూలాలను అందజేశారు. గుంటూరు నగరంతో పాటు చుట్టు పక్కల గ్రామాల భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

చదువులమ్మ గుడిలో.. జ్ఞాపకాల ఒడిలో..



నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

- 25 ఏళ్ల తర్వాత కలుసుకున్న స్నేహితులు
- సీకే బాలుర హైస్కూల్‌లో ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మంగళగిరి: పలకరింపులు.. జ్ఞాపకాల దొంతరలో.. కాలంలో పయనించి అప్పటి సంగతుల గురించి ముచ్చట్లు.. ఆనందాలు.. భావోద్వేగాలు.. ఇదీ పట్టణంలో సీకే బాలుర ఉన్నత పాఠశాలలో కనిపించిన సన్నివేశం. పాఠశాలలో 1994 నుంచి 1999 వరకు చదువుకున్న విద్యార్థులంతా ఆదివారం సమావేశమయ్యారు. 25 యేళ్ల క్రితం చదువులమ్మ ఒడిలో తాము గడిపిన మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకుని ఉల్లాసంగా ఉత్సాహం గడిపారు. వివిధ ప్రాంతాల్లో వున్నవారంతా హాజరై తమ చిన్న నాటి స్నేహితులకు కలుసుకుని.. తమ హోదాలను, స్థాయిలను మరచి చిన్న పిల్లల్లా అల్లరి చేసి ఆటలు ఆడి పాటలు పాడి ఉత్సాహంగా గడిపారు. తాము చిన్నతనంలో చేసిన అల్లర్లు, చిలిపితనాలు గుర్తుకు తెచ్చుకుని తమకు విద్యను అందించి గొప్పవారిని చేసిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. మృతి చెందిన ఉపాధ్యాయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాంస్కృతిక కార్యక్రమాలు చేసిన చిన్నారులకు ఘనంగా సత్కరించారు. మాజీ ప్రిన్సిపాల్ మంచా విజయ్ రామ్మోహన్‌రావు, పూర్వ విద్యార్థులు రేఖా నరేష్, పూర్వ ఉపాధ్యాయులు జంజనం పాండురంగారావు, దామర్ల కనక లింగేశ్వరరావు, అత్తోట రత్నబాబు, గోలి యోగేశ్వరరావు, గద్దె నరసింహారావు, రావుల సైదులు, కోర అమ్మాజీ, తుమ్మ నాగేశ్వరరావు, కాట్రు రామారావు, ఎస్.రామ్ హనుమాన్, పంచల సాంబశివరావు, పూర్వ విద్యార్థులు జంజనం సతీష్, మద్దెల కిషోర్, నక్కా శంకర్‌బాబు, చాన్ బాషా తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పాప ప్రక్షాళనతోనే శాంతి




వాక్యోపదేశం చేస్తున్న విచారణ గురువు పి.బాలస్వామి

ఫిరంగిపురం: పాపప్రక్షాళన చేసుకోవడం ద్వారానే మానవుడు శాంతిని పొందుతాడని విచారణ గురువులు పి.బాలస్వామి అన్నారు. మండలకేంద్రంలోని బాల ఏసుదేవాలయంలో పెంతికోస్తు ఆదివారం పండుగను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బాలస్వామి వాక్యోపదేశం చేస్తూ భగవంతుడు మొట్టమొదటగా మట్టితో మానవుని తయారు చేసి, శ్వాసను ఊది జీవం పోశాడని చెప్పారు. భగవంతుడిచే సృష్టించబడిన మానవుడు తన జీవనాన్ని సాగిస్తూ దేవుడి ఆజ్ఞలకు వ్యతిరేకంగా జీవిస్తాడో అతడు మృతిచెందినవాడితో సమానమని తెలిపారు. భగవంతుడు అందించిన జీవాన్ని పదిలంగా ఉంచుకోవాలంటే హృదయప్రక్షాళన అవసరమన్నారు. మనలోని కల్మషాలను తీసివేసి పరిశుద్ధంగా ఉంచుకొని భగవంతుని ప్రార్థించినప్పుడు జీవితానికి సార్థకత చేకూరుతుందని తెలిపారు. హృదయ శుద్ధి కలిగినవారు భగవంతుని దర్శనాన్ని పొందుతారని చెప్పారు. ప్రతి మానవుడు జీవితంలో ఎన్నో తప్పులు చేస్తాడని కాని ఎవరైతే తన తప్పులు తెలుసుకొని పశ్చాత్తాపం పొంది మారు మనస్సుతో భగవంతుడిని ప్రార్థిస్తారో వారిపై ఆయన కృప లభిస్తుందన్నారు. అనంతరం దివ్యపూజాబలి నిర్వహించారు. సహాయ విచారణ గురువు ఆర్.అనిల్‌కుమార్, ఫాదర్ విలియమ్స్, కథోలిక క్రైస్తవులు, మఠకన్యలు, గుడిపెద్దలు పాల్గొన్నారు.

అవోపా ఆధ్వర్యంలో పెన్షన్లు పంపిణీ

గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేటలోని ఆర్య వైశ్య అఫీషియల్స్-ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) కార్యాలయంలో ఆదివారం పేదలకు నెలవారీ పెన్షన్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంస్థ గుంటూరు శాఖ అధ్యక్షుడు కేవీ బ్రహ్మం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న క్యాపిటల్ బ్యాంక్ సీఈఓ పాండురంగ సురేష్ మాట్లాడుతూ 108 మంది పేదలకు ప్రతినెలా రూ.500 చొప్పున పెన్షన్లతో పాటు నూతన వస్త్రాలను బహూకరించడం అభినందనీయమన్నారు. కేఎహెచ్‌వీ సతీష్ మాట్లాడారు. కార్యక్రమంలో అవోపా రాష్ట్ర అధ్యక్షుడు తటవర్తి రాంబాబు, కార్యదర్శి రాచపూడి సుబ్బారావు, నగర కార్యదర్శి రాధాకృష్ణయ్య పాల్గొన్నారు.

చిలువూరులో ఉచిత వైద్యశిబిరం



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని చిలువూరు గ్రామంలో ఆదివారం రావ్స్ బాండ్స్ ఆఫ్ లవ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కొప్పుల అనిల్ బాబు జ్ఞాపకార్థం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఈ శిబిరంలో 130 మందికి గుండె సంబంధిత వ్యాధులకు, ఎముకలు, కీళ్లు, సాధార వ్యాధులు, క్యాన్సర్ నిర్ధారణ, కంటి వ్యాధులకు పరీక్షలు నిర్వహించామని తెలిపారు. విజయవాడ సెంటినీ, గుంటూరు బొమ్మిడాల క్యాన్సర్ హాస్పిటల్, అమరావతి డెంటల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్యసేవలు అందించామన్నారు. షుగర్, బీపీ, ఊపిరితిత్తుల పనితీరు, ఎకో, ఈసీజీ వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశామని తెలిపారు. ఈనెల 16వ తేదీన కంటి పరీక్షలు నిర్వహించిన వారిలో అవసరమైన 135 మందికి ఉచితంగా కళ్ళజోళ్లను అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కొప్పుల మరియమ్మ, రావ్ బాండ్స్ ఆఫ్ లవ్ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నిష్కళంక రాజకీయనేత సుందరయ్య



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు బాబుప్రసాద్



కంచర్లపాలెంలో సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పార్టీ నాయకులు


తెనాలిఅర్బన్: ప్రజాపోరాటాలోనే కాకుండా రాజకీయాల్లో కూడా నిష్కళంకగా వ్యవహరించిన వ్యక్తి పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం తెనాలి కమిటీ కార్యదర్శి కొల్లిపర బాబుప్రసాద్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.భవన్నారాయణ పేర్కొన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని చెంచుపేటలోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుందరయ్య ముందు చూపు కలిగిన వ్యక్తి అని, ఆయన రచించిన విశాలాంధ్ర, సమగ్ర నీటి పథకం గ్రంథాలే నిదర్శనాలని చెప్పారు. ఆయన రచించిన తెలంగాణ సాయుధ ప్రజాపోరాటం గుణపాఠాలు అనే పుస్తకాన్ని చైనా బాషాలో అనువాదించి అక్కడి ప్రభుత్వం కార్యకర్తలకు అందించిందని గుర్తు చేశారు. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఆయన కోరుకున్న కష్టజీవుల రాజ్యాస్థాపనకు అందరూ కృషి చేయాలన్నారు. రాబోయే కాలంలో కమ్యూనిస్టులకు మంచి రోజులు రానున్నాయనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు షేక్ హుస్సేన్‌వలి, ఎస్.రాజ్యలక్ష్మి, విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగ సంఘ నాయకులు జి.రవీంద్ర, కె.శంకరరావు, ఎస్.సుబ్రహ్మణ్యం, దుర్గాప్రసాద్, పోస్టల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు జోనేష్, బి.లక్ష్మణరావు, ఉమామహేశ్వరరావు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం.సాంబశివరావు, దాల్ మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు జి.వెంకటసుబ్బయ్య, కల్యాణ్, రైతు సంఘం నాయకులు ఎం.సాంబిరెడ్డి, ఈశ్వరి, చంద్రకళ, అంగన్‌వాడీ సంఘ నాయకులు ఎవిఎన్.కుమారి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం.వెంకటేశ్వర్లు, సుధాకర్, రాడ్‌బెడ్డింగ్ యూనియన్ నాయకులు కె.రవికుమార్ పాల్గొన్నారు.

ఆదర్శమూర్తి సుందరయ్య

కంచర్లపాలెం(తెనాలి): గ్రామంలో కమ్యూనిస్టు ఉద్యమనేత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. సీపీఎం సీనియర్ నేత ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ విశాలాంధ్రలో ప్రజారాజ్యం కావాలని భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకోసం సుందరయ్య కృషి చేశారని చెప్పారు. పార్లమెంటుకు కూడా సైకిల్‌పై వెళ్లిన ఆదర్శమూర్తి అని వివవరించారు. చుక్కపల్లి ప్రభాకర్‌రావు మాట్లాడుతూ రైతులు, కూలీలు, కార్మికుల హక్కుల కోసం అవిరళ కృషి చేసిన మహనీయుడు సుందరయ్య అన్నారు. సుందరయ్యకు నివాళులర్పించినవారిలో ఎస్.రాజ్యలక్ష్మి, ఎం.సాంబశివరావు, చుక్కపల్లి శేషగిరిరావు, పాదిలి కృష్ణ, రాళ్లపల్లి రాజా, కేసాని కృష్ణ, దేవసహాయం, ఆందజనేయులు, బి.కృష్ణరావు, బి.వెంకట్రావు, గాలి కోటేశ్వరరావు, కోగంటి రమణ ఉన్నారు.

నేడు కృత్రిమ చేతుల పంపిణీ ప్రారంభం

- దేశంలోనే ప్రప్రథమంగా చేపట్టిన రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి
- పాల్గొననున్న జర్మనీ, న్యూజిల్యాండ్, ఆఫ్రికా టెక్నీషియన్లు



కృత్రిమ చేతితో రాస్తున్న విద్యార్థి (ఫైల్)

మంగళగిరి: రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ఆధ్వర్యంలో దేశంలోనే తొలిసారిగా కృత్రిమ చేతుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. 240 మందికి సోమవారం పట్టణంలోని వీటీజేఎం ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలో కృత్రిమ చేతులు పంపిణీ చేయనున్నట్లు రోటరీ క్లబ్ ప్రతినిధి ఇసునూరి అనిల్ చక్రవర్తి ఆదివారం తెలిపారు. రూ.1.35 కోట్లతో 240 మందికి కృత్రిమ చేతులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. జర్మనీ దేశం నుంచి కృత్రిమ చేతులను దిగుమతి చేసుకున్నామన్నారు. పంపిణీ కార్యక్రమంలో జర్మనీ, న్యూజిల్యాండ్, ఆఫ్రికా నుంచి వచ్చిన టెక్నిషియన్లు పాల్గొని కృత్రిమ చేతుల వాడే విధానాన్ని బాధితులకు వివరించనున్నట్లు తెలిపారు. దేశంలోనే ప్రప్రమథంగా కృత్రిమ చేతుల పంపిణీ కార్యక్రమం చేపట్టామన్నారు.

గ్యాస్ట్రిక్ సమస్యను నిర్లక్ష్యం చేయరాదు

గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ సిద్ధార్థ రెడ్డి



మాట్లాడుతున్న డాక్టర్ ఆళ్ల సిద్ధార్థ రెడ్డి

లక్ష్మీపురం: కాలేయ, జీర్ణకోశ వ్యాధులకు ప్రస్తుతం అత్యాధునిక వైద్యం అందరికీ అందుబాటులోకి వచ్చిందని, గ్యాస్ సమస్య నివారణ మన చేతుల్లోనే ఉందనే విషయాన్ని తెలుసుకోవాలని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ ఆళ్ల సిద్ధార్థ రెడ్డి అన్నారు. స్థానిక అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి ఆధ్వర్యంలో లివర్, జీర్ణకోశ వ్యాధులపై జరిగిన ఆరోగ్య సభలో ఆయన మాట్లాడుతూ వయసుతో సంబంధం లేకుండా ఎక్కువమంది ఎదుర్కొంటున్న గ్యాస్ట్రిక్ సమస్య ప్రమాదకరమైంది కాదన్నారు. నిర్లక్ష్యం చేస్తే మాత్రం ప్రాణాలు మీదకు వచ్చేంత గందరగోళానికి గురిచేస్తుందన్నారు. అన్నవాహిక, పొట్ట, చిన్నప్రేగులు, పెద్దప్రేగులు జీర్ణప్రక్రియలో ప్రముఖ పాత్ర వహిస్తాయన్నారు. అన్నవాహికకు జీఈఆర్‌డీ సమస్య, కార్సినోమా సమస్య ఉత్పన్నమవుతాయని, ఈ సమస్యతో బాధపడేవారు పులుపు కలిగిన పండ్లను, చాక్లెట్లను, టమాట, వెల్లుల్లి, ఉల్లి, వేయించిన వస్తువులు, కూల్‌డ్రింక్స్, ఫ్యాటీ ఫుడ్స్, ఆల్కహాల్ వంటి వాటిని దూరం పెట్టాలన్నారు. తిన్న వెంటనే పడుకోరాదని, తక్కువ ఆహారం ఎక్కువసార్లు తీసుకుంటే మంచిదన్నారు. బరువును అదుపులో ఉంచుకోవాలని, పొట్టలో యాసిడ్స్ ఎక్కువగా ఉత్పన్నమైతే స్టమక్ అల్సర్, స్టమక్ క్యాన్సర్‌కి దారితీస్తుందన్నారు. అనంతరం అవగాహన సంస్థ సభ్యులు డాక్టర్ సిద్ధార్థ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సమావేశానికి టీవీ సాయిరాం కో-ఆర్డినేటర్‌గా వ్యవహరించగా, అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సంస్థ సీనియర్ సభ్యులు ఆర్.రామచంద్రరావు, శివ శంకర్‌రావు పాల్గొన్నారు.

భావసాహిత్య కవి డాక్టర్ రవూఫ్



పుస్తకావిష్కరణలో పాపినేని శివశంకర్ తదితరులు

నగరంపాలెం: భావ, సాహిత్య కవి డాక్టర్ రవూఫ్ అని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుగ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బృందావన్‌గార్డెన్స్‌లోని సీనియర్ సిటిజన్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ కార్యాలయంలో ప్రముఖ రచయిత డాక్టర్ రవూఫ్ రచించిన కవితా సంపుటి జాబిల్లి పుష్పం పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. పుస్తకావిష్కరణ చేసిన డాక్టర్ శివశంకర్ మాట్లాడుతూ కవి తన కవిత్వం ద్వారా తాను చెప్పదలుచుకున్న భావాలను సూటిగా హృదయాలను తాకేలా ఉండాలన్నారు. అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సుప్రసిద్ధ కవి డాక్టర్ ఇస్మాయిల్ వారసునిగా గత నాలుగు దశాబ్దాలుగా సాహితీ ప్రస్థానంలో డాక్టర్ రవూఫ్‌కు ప్రత్యేక స్థానం ఉందని అన్నారు. ప్రముఖ రచయిత కాట్రగడ్డ దయానంద్, ఏపీ రచయితల సంఘం అధ్యక్షురాలు డాక్టర్ చిల్లర భవానీదేవి మాట్లాడుతూ కవితా సంపుటి జాబిల్లి పుష్పంలో జాబిల్లి అనేకానేక శాఖల పుష్పంగా మారి గుబాళిస్తున్నాయని అన్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలపాక ప్రకాష్, కార్యదర్శి ఎస్ఎం సుభాని, పలువురు రచయితలు, సాహితీవేత్తలు, సాహిత్య అభిమానులు పాల్గొన్నారు.